రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

# పది, ఇంటర్ అడ్మిషన్లు స్వీకరణ

### ఓపెన్ స్కూల్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ వెంకటయ్య

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త :** ఓపెన్ స్కూల్ ద్వారా దూరవిద్య మాధ్యమంలో పదోతరగతి ,ఇంటర్మీడియట్ అడ్మిషన్లు జరుగుచున్నాయి. రెగ్యులర్‌గా చదువుకోలేని వారికోసం ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా కో ఆర్డినేటర్ వెంకటయ్య తెలిపారు.జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల (బాలుర) వికారాబాద్ పాఠశాలలో ప్రవేశాలు కల్పించడం జరుగుతుందని ఓపెన్ స్కూల్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ వెంకటయ్య ఓ ప్రకటనలో తెలిపారు.ఆగస్టు 31 తేది నాటికి పదో తరగతిలో అడ్మిషన్ పొందుటకు గాను విద్యార్థులు 14 సంవత్సరాలు ,ఇంటర్ విద్యార్థులు 15 సంవత్సరాలు నిండి ఉండాలని ఆయన తెలిపారు.అదేవిధంగా సప్లమెంటరీ విద్యార్థులు ఈనెల 30వ తేది వరకు ఫీజు చెల్లించాలని ఆయన అన్నారు.25 రూపాయల ఫైన్‌తో సెప్టెంబర్ 4వ తేది,50 రూపాయల ఫైన్‌తో సెప్టెంబర్ 9 వరకు చెల్లించాలని అన్నారు.మరిన్ని వివరాల కోసం 9502863645ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

# మాజీ ఎమ్మెల్యేను కలిసిన ఏపి మదనపల్లి ఎమ్మెల్యే



**షాద్‌నగర్‌రూరల్, ఆగస్టు 24, (ప్రభాతవార్త) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మదనపల్లి నియోజకవర్గ ఎమ్మె ల్యే మహ్మద్ షాజహాన్ బాషా శనివారం షాద్‌నగర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డిని మర్యాద పూర్వ కంగా కలుసుకున్నారు. శనివారం మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డిని శంషాబాద్‌లోని ఆయన నివాసంలో కలు సుకోవడంతో ఎమ్మెల్యేను మాజీ ఎమ్మెల్యే సాధారంగా ఆహ్వానించి శాలువాతో సత్కరిం చారురీ సందర్భంగా మద నపల్లి ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్న సమయంలో 2009 లో ఇద్దరం కూడా ఎమ్మె ల్యేలుగా పనిచేయడం జరిగిందని ఆయన గుర్తు చేసుకు న్నారు. అనంతరం పలువిషయాలపై చర్చించడం జరిగిందన్నారు.



గంజి వైష్ణవిని అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ శశాంక్

# వివిబిహెచ్ఎస్ విద్యార్థికి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు

**ఆమనగల్లు, ఆగస్టు24, ప్రభాతవార్త:** 13 నిమిషాల్లో ప్రపంచ దేశాల పేర్లు రాసి వరల్డ్ రికార్డు సాధించిన విద్యార్థిని జిల్లా కలెక్టర్ శశాంక్, డీఈఓ సుశీంద్రరావులు అభినందించి ప్రశంసలు కురిపించారు. పాఠశాల ప్రిన్సిపాల్ మహముద్, కరస్పాండెంట్ గోలి శ్రీనివాస్, ట్రస్మ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అవ్వారి శివలింగంతో కలిసి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు సాధించిన గంజి వైష్ణవి శనివారం జిల్లా కేంద్రంలోని అధికారుల కార్యాలయాల్లో కలెక్టర్, జిల్లా విద్యాధికారులను కలుసుకుని తను సాధించినటువంటి రికార్డును వివరించారు. దీంతో వారు విద్యార్థినిని అభినందిస్తూ క్రమశిక్షణ, అంకితభావం ఉంటేనే ఏదైనా సాధించవచ్చని కొనియాడారు. విద్యార్థి ప్రతిభ గుర్తించి ప్రోత్సహించిన వారిని సైతం కలెక్టర్, డీఈఓ అభినందించారు. కాగా వరల్డ్ రికార్డు సాధించిన గంజి వైష్ణవి ఆమనగల్లు పట్టణంలోని వివేకా విద్యా విద్యాభారతి ప్రైవేటు పాఠశాలలో పదవతరగతి చదువుతుంది. వరల్డ్ రికార్డు సాధించిన వైష్ణవి ప్రతిభను మండల ప్రజలు కొనియాడారు.

# కరాటేలో జ్ఞానతేజకు గోల్డ్ మెడల్

**షాబాద్, ఆగస్టు 24, ప్రభాతవార్త :** మండల పరిధిలోని లక్ష్మారావుగూడ గ్రామానికి చెందిన మేకల జ్ఞానతేజ మొయినాబాద్ మండలం కాకతీయ సుజాత స్కూల్‌లో 3వ తరగతి చదువుతుంది. చదువుతో పాటు గ్లోయింగ్ సోతకన్ కరాటే అకాడమిలో శిక్షణ పొందుతుంది. శనివారం బెంగళూర్‌లో జరిగిన ఒపెన్ శివమొగ్గ 2024 5వ ఇంటర్నేషనల్ కరాటె చాంఫియన్‌షిప్‌లో ప్రథమ గోల్డ్ మెడల్ సాధించడంతో పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు కరాటే మాస్టర్ సియాన్ కె.సుధాకర్, తల్లిదండ్రులు, మేకల ప్రభావతి=విజయ్‌శేఖర్, పెదనాన్న పెద్దమ్మ మేకల శ్రీనివవాస్, సరిత మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.... విద్యార్థులకు చదువుతో పాటు ఆసక్తి ఉన్న వాటికి అనుగుణంగా వారి అభిరుచిని బట్టి ప్రత్యేక శిక్షణ ఇచ్చి పోటీల్లో పాల్గొనే విధంగా ప్రోత్సహించాలన్నారు.

# ప్రత్యేక అధికారి హాస్టల్ తనిఖీ



హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న రాజారత్నం

**కేశంపేట, ఆగస్టు 24, ప్రభాతవార్త** కేశంపేట మండల పరిధిలోని పాటిగడ్డలోని కేజీబీవి పాఠశాల కొత్తపేటలోని ఎస్సీ హాస్టల్‌లను శనివారం మండల ప్రత్యేక అదికారి రాజారత్నం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూడాలని సీజనల్ వ్యాధులపట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని వార్డెన్లకు సూచించారు. అనంతరం అమ్మ ఆదర్శపాఠశాల కమిటీ ద్వారా మంజురైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కొత్తగా నిర్మిస్తున్న కేజిబివి పాఠశాలలను వెంటనే పూర్తి చేయాలని ఏఈటిఐఎస్ ఐడిసీలకు ఆదేశించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో రవిచంద్ర కుమార్‌రెడ్డి ఎంపిఓ కిష్టయ్య ఏఈపిఆర్ నర్సింగారావు ఏఈటిఐఎస్ఐడి సి శివకుమార్ కేజిబివి పాఠశాల ప్రిన్సిపల్ గౌసియా బేగం ఎస్సీ హాస్టల్ వార్డెన్ రాధాకృష్ణ అధికారులు పాల్గొన్నారు.

# పేదల ఇళ్లస్థలాలపై రియల్ వ్యాపారుల దౌర్జన్యం

### కరెంట్ కట్ చేసి దున్నుతూ కబ్జాకు యత్నం

**మొయినాబాద్, ఆగస్టు 24,ప్రభాతవార్త:** నిరుపేదల ఇళ్ల స్థలాలపై కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు వచ్చి కబ్జాకు యత్నం చేస్తూ రైతులున్నటువంటి స్థలాలపై కరెంట్ కట్ చేస్తూ దున్నుతూనానా ఇబ్బందులు పెడుతు కబ్జాకు యత్నిస్తున్నటు బాధితులు తెలియజేశారు. ఈ సంఘటన మొయినాబాద్ మండలంలోని సజ్జన్‌పల్లి గ్రామ రెవె న్యూలో చోటు చేసుకుంది. 2007లో నాటి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు 72 మందికి ఇచ్చింది. అట్టి భూమిపైకి రియల్ ఎస్టేట్ బ్రోకర్లు కొంత మంది కబ్జాకు యత్నిస్తున్నరాని ఆవేదన వ్యక్తం చేశారు.అందుకు నిరసనగా పట్టాదారులు స్థానిక ఎమ్మార్వో కార్యాలయంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సిపిఐ మండల కార్యదర్శి శ్రీనివాసులు ఆద్వర్యలో ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సజ్జన్పల్లి రైతు సంఘం సెక్రటరీ నరసింహారెడ్డి మైనవాది మండల రైతు సంఘం అధ్యక్షుడు వెంకటయ్య ఆర్ రవీందర్‌రెడ్డి ఆర్ నరసింహారెడ్డి ప్రశాంత్ నరసింహులు విట్టలయ్య ఫయాజ్ ఫన్‌పల్లి ఆంజనేయులు సజ్జనపల్లి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మార్వో కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

# ధరణిపై కొత్త ఆర్ఓఆర్ చట్టం

## జిల్లా కలెక్టర్ గౌతమ్



హక్కుల రికార్డుల చట్టం ముసాయిదాపై జరిగిన అభిప్రాయ సేకరణ,చర్చను ప్రారంభించి మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్,పాల్గొన్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిఆర్ఓ,తదితరులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 24, ప్రభాతవార్త** తెలంగాణ హక్కుల రికార్డుల చట్టం 2024ముసాయిదాపై అభిప్రాయ సేకరణ, చర్చ జరిగింది. శనివారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ఆ ముసాయిదాపై అభిప్రాయసేకరణ, చర్చ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ గౌతమ్ ప్రారంభించారు. దీనిలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిఆర్ఓ హరిప్రియతో కలిసి అభిప్రాయ సేకరణ, చర్చ కార్యక్రమాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగ కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ధరణి సమస్యలను పరిష్కరించటానికి తెలంగాణ హక్కుల రికార్డుల చట్టం 2024 రూపకల్పనకు అభిప్రాయసేకరణ కార్యక్రమాన్ని చేపట్టటం హర్షించదగ్గ విషయమని అభిప్రాపడ్డారు. 1971లో ఆర్ఓఆర్ చట్టం వచ్చిందని, 1989నుంచి ఇదే చట్ట ప్రకారం పట్టాదారు పాసుపుస్తకాల ద్వారా భూపంపిణీ చేయటం జరిగిందన్నారు. 2020వరకు కూడ ఈ చట్ట ప్రకారం రెవెన్యూ శాఖ వ్యవరించిందన్నారు. కోర్టులలో కూడ ఈ చట్ట నిబంధనల మేరకు కేసులు పరిష్కరించటం జరిగిందన్నారు. అక్టోబరు 2020 నుంచి ధరణి పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ ద్వారా అప్‌డేషన్ చేయటం జరిగిందన్నారు. ధరణిలో రిజిస్ట్రేషన్ అయిన వెంటనే జాప్యం లేకుండ పాసుపుస్తకం అందించేవారని, కొన్ని సమస్యలు ఎద్కోవటం జరిగిందన్నారు. తెలంగాణ హక్కుల రికార్డుల చట్టం 2024రూపొందించటానికి రాష్ట్రమంతటా అభిప్రాయసేకరణ జరిపించాలని ప్రభుత్వం ఆదేశించినందున చర్చ కార్యక్రమంలో రిటైర్డ్ రెవెన్యూ అధికారులు, నల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు, ప్రజాప్రతినిధులు, రైతులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు తెలంగాణ హక్కుల రికార్డుల చట్టం 2024బిల్లులోని అంశాలపై సలహాలు, సూచనలు అందించాలని కోరుకున్నారు. అదే విధంగ మీ అభిప్రాయాలను రాతపూర్వకంగ కూడ అందించానలి కలెక్టర్ తెలిపారు. సేకరించిన మీ అభిప్రాయాలను క్రోడీకరించి ప్రభుత్వానికి నివేధిక అందజేయటం జరుగుతుందన్నారు. సురేశ్ పొద్దుర్ వికారాబాద్ జాయింట్ కలెక్టర్ (రిటైర్డ్) తన అభిప్రాయాలను తెలుపుతూ గ్రామ స్థాయిలో గ్రామసభలు నిర్వహించాలని, చిన్న చిన్న సమస్యలను తహసీల్దార్ స్థాయిలోనే పరిష్కరించాలని మ్యూటేషన్ తప్పకుండ చేసిన తరువాత పాసుపుస్తకాలు అందజేయాలని అన్నారు. 1971లోని భూసంస్కరణ చట్టాలను ఆధారంగ ప్రజలకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండ నూతన చట్టాలను రూపొందించాలని అన్నారు.

నల్సార్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జె. మల్లిఖార్జున్ మాట్లాడుతూ భూసంస్కరణలో పట్వారీ వ్యవస్థ చాలా పాతదని, చాలా ఖచ్చితమైనదని, ఈ పద్దతిలో చిన్నచ చిన్న పొరపాట్లు తప్ప ఇబ్బందులు ఎక్కువగా ఉండేవని కావని తెలుస్తుందన్నారు. నూతన చట్టాలను రూపొందించేపుడు గతంలో జరిగిన తప్పులను సవరిస్తూ సర్వే డిపార్ట్‌మెంట్ వారు సహకారం తీసుకుంటూ రికార్డులపు తప్పులు లేకుండ సవరించి వాటి ద్వారా కొత్త చట్టాలను రూపొందించాలని అభిప్రాయపడ్డారు. రెవెన్యూ ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని సూచించారు. రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ రవీంద్రబాబు తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ గ్రామ స్థాయిలో విఆర్ఓ వ్యవస్థ తప్పనిసరిగా ఉండాలని, గ్రామాలలో జరిగే భూసమస్యలను విఆర్ఓలు, తహసీల్దార్ల దృష్టికి తీసుకవచ్చి పరిష్కరిస్తారని అన్నారు. మ్యూటేషన్ తప్పనిసరిగా చేయాలని అన్నారు. నల్సార్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అశ్విన్‌కుమార్ మాట్లాడుతూ చట్టాలను రూపొందించేపుడు స్పష్టమైన ఆదేశాలను పొందపర్చాలని అన్నారు. చట్టం తయారు చేసే వారికి అమలు చేసే వారికి గ్యాప్ రాకుండ ఉండాలని అన్నారు. ఎవరి కోసం చట్టాలు రూపొందిస్తున్నామో వారికి ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. భూతగాదాలు కోర్టులలో పరిష్కారానికి చాలా కాలం పడుతుందని భూసంస్కరణలకు సంబంధించి ట్రిబ్యునల్స్‌ను ఏర్పాటు చేయాలని అన్నారు. అందులో జడ్జి, ఉన్నతాధికారులు కమిటీలుగా ఏర్పాటు చేయాలన్నారు. గ్రామస్థాయిలో ఉచితంగ సలహాలు, సూచనలు అందించేందుకు కస్టమర్ కేర్ సర్వీస్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. వీరే కాకుండ రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొని వారి సలహాలు సూచనలను కలెక్టర్‌కు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ హరిప్రియ, ఎఒ రాంమోహన్, ఆర్డీఓలు, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. దీనిలో మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, టిపిసిసి ఉపాద్యక్షులు,మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్, డిసిసి అధ్యక్షులు హరివర్ధన్‌రెడ్డి, రాష్ట్ర కిసాన్‌సెల్ ప్రధాన కార్యదర్శి జి.వేణు గోపాల్‌రెడ్డి, నాయకులు, రైతులు నర్సింహ్మారెడ్డి పాల్గొన్నారు.

# అటవీ భూముల సంరక్షణలో బిట్ ఆఫీసర్ల పాత్ర కీలకం



శిక్షణ పొందుతున్న ఆఫీసర్స్ కు పలు సూచనలు చేస్తున్న అధికారులు

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త :** తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ దూలపల్లిలో శిక్షణ పొందుతున్న 33మంది ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ వారి ఫీల్డ్ శిక్షణలో భాగంగా శనివారం వికారాబాద్ జిల్లాలో అటవీ శాఖ చేపట్టిన వివిధ పనులను సందర్శించారు.వృత్తి శిక్షణలో భాగంగా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు అనంతగిరి రిజర్వ్ ఫారెస్ట్ ఇక్కడ అభివృద్ధి చెందుతున్న టూరిజం పార్కింగ్ ట్రిక్కింగ్ ఏరియా ,వాచ్ టవర్ గ్రాస్ ల్యాండ్ ఏరియా మొదలైన ప్రాంతాలను స్టడీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్ మాట్లాడు తూ...అటవీ భూముల సంరక్షణలో అడవుల అభివృద్ధిలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు ప్రధానమైన పాత్ర పోషిస్తారని ఈ క్రమంలో బీట్ ఆఫీసర్లపై ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని అన్నారు. ఈ వృత్తిపరమైన వర్తిరులను అధిగమించడానికి అటు సమాజంలోని వ్యక్తులతో పాటు తన సహచరులతోతన పైన ఇతరుల అధికారులతో ఆరోగ్యకరమైన సంబంధాలు నెలకొల్పుకోవాలి అన్నారు.ఒక్కొక్క ప్రాంతంలోని ఆడవులకు ఒక్కొక్క ప్రత్యేకత ఉంటుందని దానిని బీట్ ఆఫీసులే గుర్తించాలి మరియు ఆ ప్రత్యేకతను సంరక్షించాలి అప్పుడే ఆ ప్రాంతంలోగల జీవవైవిద్యాన్ని కాపాడవచ్చు. ప్రస్తుతం ఉన్న సమయంలో భారతదేశంలో జనాభా పెరగడంతో పాటు ఫారెస్ట్ భూములపైన తీవ్రమైన ఒత్తిడి ఉందని దినిని దృష్టిలో ఉంచుకొని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు తమ విధులను నిర్వర్తించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో వికారాబాద్ ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్యాయ్ కుమార్,వికారాబాద్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ అరుణ,తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ అసిస్టెంట్ పోస్ట్ డైరెక్టర్ సుభాష్ చంద్ర యాదవ్,తదితరులు పాల్గొన్నారు.

# పబ్లిక్ స్కూలులో ఘనంగా జన్మాష్టమి వేడుకలు



శ్రీకృష్ణ వేషధారణలో విద్యార్థులు



రాధాకృష్ణులతో ఉపాధ్యాయులు, తదితరులు

**కొత్తూర్, ఆగస్టు 24, ప్రభాతవార్త :** కొత్తూర్ పురపాలిక పరిధిలోని శ్రీవెంకటరమణ పబ్లిక్ స్కూల్‌లో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు కన్నులపండువగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి కొత్తూర్ మున్సిపల్ కౌన్సిలర్, స్కూల్ చైర్మెన్ వీరమోని హేమదేవేందర్‌ముదిరాజ్ హాజరయ్యారు. చిన్నారులు భక్తిభవంతో శ్రీకృష్ణుడు, రాధిక, సత్యభామ, గోపికల వేషధారణలు ఎంతో ఆకట్టుకున్నాయి. ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై చిన్నారులు ప్రదర్శించిన వేషధారణలు, వారి ముద్దు మద్దు నడకలు, నృత్యాలు, భక్తి, కీర్తనలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా మాట్లాడుతూ.... తమ స్కూల్‌లో ప్రతి విద్యార్థిని విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించి వారి భవిష్యత్తు కార్యచరణను తీర్చిదిద్దడమే శ్రీవెంకటరమణ పబ్లిక్ స్కూల్ ప్రత్యేకత అన్నారు. ప్రతి ఫెస్టివల్‌ను తమ విద్యార్థుల చేత పాఠశాలలో విద్యార్థులను శ్రీకృష్ణ,రాధిక, సత్యభామ గోపికల వేషధారణలో సాంప్రదాయబద్దంగా విద్యార్థులు కనబర్చారు. విద్యార్థుల ప్రతిభను అభినందించిన ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు సాంస్కృతిక విలువలను, సంప్రదాయాలను ఇలా మనసారా ఆచారించడం ఎంతో సంతోషకరమన్నారు. ఆధ్యాత్మికతను, సాంప్రదాయాన్ని అభివృద్ధి చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడుతాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు బీవీరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.



### కడ్మూరు ప్రాథమిక పాఠశాలలో..

**పూడూరు, ఆగస్టు 24, ప్రభాతవార్త :** సాంప్రదాయ పండుగలను ప్రతిఒక్కరు జరుపుకోవాలని ప్రధానోపాధ్యాయులు మధు పేర్కొన్నారు.శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా శనివారం పూడూరు మండలం పరిధిలోని కడ్మూరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులచే శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మధు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఆధ్యాత్మి కతను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతా యన్నారు. ఈ సందర్భంగా రాధాకృష్ణులతో పాటు గొల్ల భామల వేషాధారణలతో విద్యార్థులు చేసిన నృత్యాలు ఆలరింపజేశాయి.అనంతరం విద్యార్థులకు ప్రోత్సా హక బహుమ తుల ప్రధానం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనూష, హరీష్, విద్యార్థుల తల్లిదండ్రులు నహీద్,రవీందర్, యాదయ్య, అంజయ్య, లింగం, అంజలి, మాధవి, సంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

### షాద్‌నగర్‌లో..

**షాద్‌నగర్‌రూరల్, ఆగస్టు 24, (ప్రభాతవార్త) :** షాద్‌నగర్ పట్టణంలోని మాగ్నట్, శ్రీ చైతన్య తదితర పాఠశాలలో శనివారం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలలోని చిన్నారి విద్యార్థులు శ్రీకృష్ణ, రాధ,గోపిక వేషాధారణలతో ఆలరించి చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో శ్రీకృష్ణ గోపిక వేషాదారణలో చిన్నారులు కోలాటాలు, నృత్య ప్రదర్శనలు చేశారు. ఆయా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాఠశాలల ప్రిన్సిపాల్స్ ఆనంద్, ఉమాదేవి, అధ్యాపక బృందాలు పాల్గొన్నారు.

# ఆసుపత్రి కార్మికులకు వేతనాలు చెల్లించాలి

**ఘట్‌కేసర్, ఆగస్టు 24, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లోని వైద్యవిధాన పరిషత్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు రెండు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్ సామాజిక ఆసుపత్రి ఆవరణలో శనివారం కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. కార్మికులకు వేతనాలు సరిగా రాకపోవడంతో వారు కుటుంబాలను పోషించడం కష్టంగా మారిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు కె.జయచంద్ర, సీపీఐ ఘట్‌కేసర్ కార్యదర్శి ఎల్. ఈశ్వర్‌లు పాల్గొని మాట్లాడుతూ కార్మికులతో కలిసి నినాదాలు చేశారు. కార్మికులు శివమ్మ, లక్ష్మి, లూదియా, ఇందిరా, స్వరూప, సత్యనారాయణ, ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు.




ఘట్‌కేసర్ సామాజిక ఆసుపత్రిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐటీయూసి నాయకులు, కార్మికులు

వెంకటేశ్వర దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, దర్శించుకుంటున్న భక్తులు





# భక్తిశ్రద్ధలతో శ్రావణమాస పూజలు

### శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో లక్షతులసి అర్చన

**కొడంగల్,ఆగస్టు 24 ప్రభాతవార్త** హిందువులు అత్యంత పవిత్రంగా భావించే శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని దేవాలయాల్లో ప్రత్యేక పూజలతో శ్రావణ శోభ సంతరించుకుంది.ఉపవాస దీక్షలతో భక్తులు దేవాలయాలకు వెళ్ళి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.పేదల పెన్నిధిగా పేరుగాంచి రెండవ తిరుపతిగా వెలుగొందుతున్న కొడంగల్ శ్రీమహలక్ష్మి వెంకటేశ్వర దేవాలయంలో శ్రావణమాస పూజలు ఘనంగా కొనసాగుతున్నాయి. శ్రావణమాసం మూడవ శనివారంను పురస్కరించుకొని ఆలయంలో లక్ష తులసి అర్చన కార్యక్రమం భక్తుల కొలహాలం మద్య ఘనంగా కొనసాగింది.శనివారం స్వామి వారికి విశేష అలంకరణలతో పూజలు నిర్వహించగా కొడంగల్ పరిసర గ్రామాల ప్రజలతో పాటు తాండూర్,పర్గి తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.ఉదయం నుంచే ఆలయ అర్చకులు,25 మంది వేద పండితులు లక్షమంది గోత్రనామాలతో నిరంతర పూజలు నిర్వహించారు.సుప్రభాత సేవలతో మొదలు కుంకుమార్చన,అభిషేకం తదితర పూజలను నిర్వహించారు.లక్ష తులసి అర్చన కార్యక్రమంలో భాగంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు ఏర్పడకుండా ఎన్‌సిసి విద్యార్థులు తగు భద్రత ఏర్పాట్లు చేశారు.కార్యక్రమంలో ఆలయ అర్చకులు రామస్వామితో పాటు వేదపండితులు శ్రీమాన్ ధరూరి శ్రీనివాసాచార్యులు,కిట్టుస్వామి,లోకూర్తి జయతీర్థాచారి, దొండెరావు జ్యోషి,లక్ష్మీనారాయణజ్యోషి, వెంకుస్వామి, జనార్దన్‌లతో పాటు ఆలయ ధర్మకర్తలు నందారం శ్రీనివాస్,రత్నం,నందారం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

### అభయాంజనేయ స్వామి ఆలయంలో..

శ్రావణమాసం మూడవ శనివారంను పురస్కరించుకొని స్దానిక అభయంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.స్వామివారికి విశేష అలంకరణలతో అభిషేక పూజల్లో పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారి అభిషేక పూజలు భక్తుల కొలహాలం మద్య వైభవంగా నిర్వహించారు.

# ప్రధాని మోదీని కలిసిన కుల్కచర్ల వైద్య విద్యార్థి

**కుల్కచర్ల, ఆగస్టు 24 ;ప్రభాతవార్త;** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలోని వైద్య విద్యార్థికి ఉక్రెయిన్‌లో అరుదైన గౌరవం లభించింది. కుల్కచర్ల మండల కేంద్రానికి చెందిన మాజి సర్పంచ్ ప్రముఖ వైద్యుడు డా. జానకిరామ్ తనయుడు అక్షయ్‌కుమార్ చౌహన్ జర్మనీలోని ప్రఖ్యాత కెఎమ్‌యు యూనివర్శిటీలో ఎమ్‌బిబిఎస్ ఫైనల్ హియర్ చదువుతున్నాడు. ప్రదాని ఉక్రెయిన్ పర్యనలో బాగంగా పెలెక్టెడ్ విద్యార్థులను ఆయనను కలిసే అవకాశం కల్పించారు.వారిలో కుల్కచర్లకు చెందిన అక్షయ్ కుమార్ ఉండటం సంతోషకరం.ఈ సందర్భంగా వైద్య విద్యార్థులను ఉద్దేశించి బాగా చదువుకుని మీ ఊరుకి దేశానికి మంచిపేరు తీసుకురావాలని ఎక్కడ చదివినా మాతృభూమిని మరిచిపోరాదని మీరు సేవలందించడం కోసం భారత్‌లో మీకు కావలసిన సదుపా యాలు కల్పిస్తానని చెప్పి నట్టుగా వారు వివరించారు. అత్యుత్తమ స్థాయిలో ఉండి కూడా ఆప్యాయంగా పలకరిం చి ఆలింగనం చేసుకున్నారని తెలిపారు.ఈ మేరకు మోదితో చదువు పూర్తయిన వెంబడే భారత్‌లో పేదలకు తన వంతు సహకారం అందిస్తూ సేవ చేస్తానని మమ్మ ల్ని ఈ స్థాయిలో నిలబెట్టిన కన్న వారికి పురుడుబోసుకున్న మాతృ భూమి రుణం తీర్చుకుంటామని విద్యార్థులు తెలియజేశారు.



ప్రధాని మోదీని కలుసుకున్న జర్మని వైద్య విద్యార్థులు



## ప్రభుత్వ భూమిలో అక్రనిర్మాణాలు కూల్చివేత



**శంషాబాద్, ఆగస్టు 24, ప్రభాతవార్త** శంషాబాద్ మండలం బహదూర్ గూడ గ్రామంలోని సర్వేనంబర్ 62లో ఉన్న ప్రభుత్వ భూములలో ఇటీవల కొందరు వ్యక్తులు నిర్మాణాలు చేపట్టారు. రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం వాటిని కూల్చివేశారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సంజీవ ఆధ్వ ర్యంలో సిబ్బంది అక్రమ నిర్మాణాలను కూల్చి వేశారు. విషయం తెలుసుకున్న స్థానికులు వచ్చి అధికారులతో వాదిం చారు. ప్రభుత్వం నిరుపేద రైతుల జీవితాలతో చెలగాటం ఆడటం సమంజసం కాదని వెంటను రైతులందరికీ పట్టాదారు పాసుబుక్కలు అందజేయాలని వారు కోరారు.

## ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

**మొయినాబాద్, ఆగస్టు 24, ప్రభాతవార్త** శ్రీకేజిరెడ్డి కాలేజీఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో 13వ గ్రాడ్యుయేషన్‌డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు 2020-24 ఉత్తీర్ణులైన వారందరు హాజరయ్యారు. ఈ క్యాక్రమానికి ముఖ్య అతిధులుగా శ్రీ వెంకట సుబ్రమణ్యం, శ్రీగుణేష్ భద్రాకి, శ్రీ ప్రశాంత్‌లింగం పాల్గొనగా ఈ కార్యక్రమానికి డాక్టర్ అంగేతు సైదా కన్వీనర్‌గా నిర్వహించారు. ఈ యొక్క కార్యక్రమం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్‌కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిధులు పిల్లలనుద్దేశించి సలహాలు సూచనలు ఇచ్చారు. డాక్టర్ కందకట్ల రోహిత్ పిల్లలనుద్దేశించి ఆయన యొక్క అనుభవాలను ఇంకా ముందు రోజులలో చేయాల్సిన పనితనాన్ని చెప్పారు. ఇంకా ఈ సమావేశానికి మనం కొంచం బుణపడి ఉండాలని సూచనలు ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపల్ సాయి సత్యనారాయణ రెడ్డి పిల్లలనుద్దేశించి తల్లిదండ్రులకు మనం ఎంతో గౌరవం ఇవ్వాలని ఇంక ముందు రాబోయే కాలంలో అంతా మంచి జరగాలని పిల్లలకు చెప్పారు. ఈ యొక్క కార్యక్రమానికి డాక్టర్ మంతెన నర్సయ్య పాల్గొన్నారు. ఇంకా వివిధ కోర్సులకు సంబంధించిన హెచ్‌ఓడీలు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతిభావంతులైన పిల్లలకు గోల్డ్‌మెడల్స్ మరియు ప్రశంసాపత్రాలు అందజేశారు. అందరి గ్రాడ్యుయేట్స్‌కు ప్రశంసాపత్రాలు గౌరవనీయులైన అతిధులు హెచ్‌ఓడీస్ పర్యవేక్షణలో అందించారు. ఈ యొక్క కార్యక్రమానికి గ్రాడ్యుయేట్స్‌తో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## (ఎస్‌జీఎఫ్) పెద్దేముల్ జోనల్ సెక్రటరిగా శివప్రసాద్

**కోట్‌పల్లి ఆగస్టు, 24 ప్రభాతవార్త;** వికారాబాద్ స్థాయిలో జరిగిన సమావేశంలో (ఎస్‌జీఎఫ్) పెద్దేముల్ జోనల్ సెక్రటరిగా కోట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న యం, శివప్రసాద్ ఫిజికల్ డైరెక్టర్‌ను ఎన్నుకోవడం జరిగిందని మండల విద్యాధికారి చంద్రప్ప తెలిపారు. కోట్‌పల్లి, ధారూర్, పెద్దేముల్ మూడు మండలాల్లో జరిగే స్కూల్‌గేమ్స్, అన్ని జోనల్ సెక్రటరి అధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. కోట్‌పల్లి ఉపాధ్యాయుడు జోనల్ సెక్రటరి ఎన్నిక కావడం చాలా సంతోషంగా ఉందని అయన అభినందనలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు బుచ్చిరెడ్డి, మోహన్, వెంకట నర్సింహరెడ్డి, రాంరెడ్డి, తిరుమలయ్య, మురళిమోహన్, మల్లేశం, లక్ష్మన్, యాస్మిన్‌బేగం, అంజియ్య, యాదవరెడ్డి, ఫాతిమబేగం, శ్రీనివాస్, వెంకటేష్, నవీన్, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు,

## మండలంలో పర్యటించిన ఎంపిడిఓ



పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్

**జిల్లెడు చౌదరిగూడ, ఆగస్టు 24,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్ పర్యటించారు. మండలంలోని వీరన్నపేట గ్రామంలో పర్యటించిన ఆయన ఓటరు నమోదు ప్రక్రియ, పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అందజేస్తున్న వసతులను తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనంను పరిశీలించారు. రికార్డులు పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉపధ్యాయులకు సూచించారు. అనంతరం పల్లె ప్రకృతి వనంను ఆయన సందర్శించి మొక్కల పెంపుదలకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. అలాగె మండలంలోని గాలిగూడ గ్రామంలో ఓటరు నమోదు ప్రక్రియను ఆయన ఆయన పరిశీలించారు.గ్రామంలో జరుగుతున్న పనులను సందర్శించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండ చూడాలని ఆయన పెర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ హన్మంత్‌రెడ్డి, పంచాయితీ కార్యదర్శులు రవీందర్, ఫషి తదితరులు ఉన్నారు.

## ఘనంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ట

**ప్రతి ఒక్కరూ దైవ మార్గంలో నడవాలి: శ్రీనివాస్‌యాదవ్**



**తలకొండపల్లి, ఆగస్టు 24,ప్రభాతవార్త:** కల్వకుర్తి నియోజకవర్గం తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామపంచాయతీ చెన్నంపల్లి గ్రామంలో నూతన పోచమ్మ ఆలయంలో విగ్రహాల ప్రతిష్టాపన గూడ యాదగిరి నరసింహయ్య శర్మ వేద పండితులచే అంగరంగవైభవంగా కనుల పండువగా విగ్రహాలను ప్రతిష్టించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సిఎల్ శ్రీనివాస్‌యాదవ్ మండల కాంగ్రెస్ ప్రెసిడెంట్ ప్రభాకర్‌రెడ్డి మాజీ సర్పంచ్ రమేష్ యాదవ్ మాజీ ఎంపిటిసిలు ఆంజనేయులు గౌడ్ అంబాజీ మాజీ ఉపసర్పంచ్‌లు మల్లేష్ అజీజ్ నాయకులు లక్ష్మీనారాయణ గౌడ్ నందానందంగౌడ్ శ్రీనివాస్ రెడ్డి లక్ష్మయ్య యాదవ్ నరేందర్ గౌడ్ విష్ణువర్ధన్ యాదవ్ మాస్కు వెంకటయ్య శ్రీనివాస్ యాదవ్ శేఖర్ గౌడ్ చంద్రయ్య గౌడ్ కృష్ణయ్య రాములు వెంకటయ్య గౌడ్ శేఖర్ రామస్వామి రాజేందర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

### బేకాన్ ఫండ్ ఆరంభించిన జియోజిత్

20 సంవత్సరాలుగా ప్రముఖ పెట్టుబడి సంస్థ మరియు విశ్వసనీయ పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ప్రొవైడర్‌వియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్. ఫ్లెక్సీ క్యాప్ పోర్ట్ఫోలియోగా బేకాన్ అన్ని మార్కెట్ క్యాపిటలైజేషన్లలో పెట్టుబడి పెట్టడం ద్వారా విశిష్టమైన స్థిరత్వం మరియువృద్ధి చెందుతుంది.

### ఫొటో గ్రఫీ అవార్డ్స్

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని విశ్వసనీయగ్లోబల్‌స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ వివోఇమాజిన్‌స్మార్ట్‌ఫోన్ ఫొటోగ్రఫీ అవార్డ్స్ రెండో ఎడిషన్‌ను ప్రారంభించింది.



కృష్ణుడు,రాధ వేషధారణలో చిన్నారులు

## ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**షాబాద్, ఆగస్టు 24, ప్రభాతవార్త :** షాబాద్ మండల పరిధిలోని నాగర్‌గూడ అక్షర టాలెంట్ స్కూల్‌లో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా నాగర్‌గూడ అక్షర టాలెంట్ స్కూల్ చిన్నారులు శ్రీకృష్ణులు, గోపికల వేషధారణలతో పలు సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉట్టిలు కొట్టారు. పాఠశాల కరస్పాండెంట్ రాజు మాట్లాడుతూ.... ప్రతి ఒక్కరు సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడాలన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికచింతన అలవర్చుకోవాలి



పూజ నిర్వహిస్తున్న మాజీ ఎంపీటీసీ దంపతులు

**షాబాద్, ఆగస్టు 24, ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికచింతన అలవర్చుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య అన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని సంకేపల్లిగూడలోని తన వ్యవసాయ క్షేత్రంలో నిర్మించిన మైసమ్మ, ఎల్లమ్మ దేవాలయంలో ఘనంగా హోమం, వ్రతం కార్యక్రమం నిర్వహించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికత వైపు దృష్టి సారించాలని తద్వారా మనుషులకు ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో గ్రామస్థులు ఉన్నారు.

## సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పది

**షాబాద్, ఆగస్టు 24, ప్రభాతవార్త :** సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పదని పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎల్.నర్సింలు అన్నారు. శనివారం మండల పరిధిలోని మద్దూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో శంకర్, మాలిని, స్వరూప టీచర్లు బదిలీపై వెళ్లడంతో గ్రామస్థులు వారిని ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.... సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పదన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ తప్పనిసరి అన్నారు. ఈకార్యక్రమంలో పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి కృష్ణ, ఉపాధ్యాయులు దేవిడ్‌రెడ్డి, జయరాజ్, గ్రామస్థులు ఉన్నారు.

## జాటావత్ కుటుంబానికి అండగా ఉంటాం



ఆర్థిక సాయం అందజేస్తున్న సింగిల్‌విండో డైరెక్టర్ రాజవర్ధన్‌రెడ్డి

**మాడ్గుల, ఆగష్టు24, ప్రభాతవార్త:** మాడ్గుల మండలంలోని పల్లుతాండ గ్రామపంచాయితీ పరిదిలోని పడమటి తాండకు చెందిన జాటావత్ జైపాల్‌నాయక్ కుటుంబానికి అండగా ఉంటామని సింగిల్ విండో డైరెక్టర్ కల్లు రాజవర్ధన్‌రెడ్డి అన్నారు. జైపాల్‌నాయక్ నివాసంలో కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ నుండి 3వేలు, ఆయన వ్యక్తిగతంగా 3వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వాసురాం నాయక్, జాటావత్ శర్మ, లాలునాయక్, రాజు, యాచారం శంకర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యనే సమాజాభివృద్ధికి దోహదం

### పేద విద్యార్థులకు ప్రోత్సాహం




బ్యాగులు, నోట్‌బుక్స్, బట్టలు అందజేస్తున్న సుదర్శన్, సాయిబాబు, సంస్థ ప్రెసిడెంట్ పొదిలి నారాయణ

**శామీర్‌పేట, ఆగస్టు 24, ప్రభాతవార్త**

విద్యనే సమాజాభివృద్ధికి దోహదపడుతుందని, పేద విద్యార్థుల భవిషత్ కోసం షేర్ ది విజన్ హెల్పింగ్ హేండ్స్ వలంటరీ ఆర్గనైజేషన్ కృషి ప్రశంసనీయమని శామీర్‌పేట గ్రామ మాజీ ఎంపిటిసిలు వి.సుదర్శన్, డి.సాయిబాబు పేర్కొన్నారు. శామీర్‌పేట గ్రామపంచాయతీ పరిధిలోని పెద్దమ్మకాలనీలో షేర్ ది విజన్ ఖమ్మం వారు హెల్పింగ్ హేండ్స్ వలంటరీ ఆర్గనైజేషన్ నిర్వహిస్తున్న డే కేర్ ట్యూషన్ సెంటర్‌కు వారు సుమారు 3.5లక్షల రూపాయలతో విరాళంగ బియ్యం, కందిపప్పు, నూనె, నిత్యావసర సరుకులు, 50స్కూల్ బ్యాగులు, నోటుపుస్తకాలు, బట్టలు, దుప్పట్లు, క్రికెట్ ఆటవస్తువులు, గీజర్స్, ఫ్యాన్‌లు, మిక్సిలు, బిస్కెట్లు, స్నాక్స్‌ను వారు పేద విద్యార్థుల కోసం ఉచితంగ అందించటంతో మాజీ ఎంపిటిసి వి.సుదర్శన్, డి.సాయిబాబులు విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగ వారు మాట్లాడుతూ విద్యా అవసరాలు అందిస్తే భవిషత్‌లో వీరు ఉన్నత స్థాయిలో ఉంటారని వారు అన్నారు. విద్యార్థులకు అందిస్తున్న ఈ సహాయం భవిషత్‌లో అభివృద్ధికి సోపానం అవుతుందన్నారు. ఈ సంస్థ ప్రెసిడెంట్ పొదిలి నారాయణ మాట్లాడుతూ మధర్ థెరిస్సా సేవలను కొనసాగిస్తున్నామని అన్నారు. చిన్నారుల భవిష త్‌కు ఆధారమైన విద్య కొరకు సహాయం చేయటం చాలా సంతోషంగ ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పొదిలి నారాయణ, వీరబాబు, సుదర్శన్, సాయి, జలాది, సుధీర్ శాస్త్రి, ఫాస్టర్ జాన్‌పాల్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసి బస్సులో నుంచి పడి మహిళలకు తీవ్రగాయాలు

**కేశంపేట, ఆగస్టు 24,ప్రభాతవార్త:** ఆర్టీసీ బస్సులో నుంచి పడి మహిళకు తీవ్ర గాయాలు అయిన సంఘటన కేశంపేట మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం షాద్‌నగర్ నుంచి ఆమన్‌గల్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు కేశంపేట వైయస్సార్ చౌరస్తా వద్దకు రాగానే ప్రయాణికులు దిగేందుకు బస్సు ఆపగా కొంతమంది ప్రయాణికులు దిగారని ఢిల్లీ సత్యమ్మ దిగుతుండగానే ఆర్టీసీ బస్సు డ్రైవర్ పర్వతాలు బస్సును అజాగ్రత్తగా ముందుకు పోనిచ్చాడు. ఆదే క్రమంలో కాకునూరు గ్రామానికి చెందిన ఢిల్లీ సత్యమ్మ (70) తలకు ఎడమ కాలు పాదానికి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన మహిళను కేశంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనంతరం మెరుగైన చికిత్స కోసం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించినట్లు తెలిపారు.



రూ.40 వేలు అందజేసిన దశరథ్ నాయక్, గంప వెంకటేష్

## బోనాల ఉత్సవ కమిటీకి రూ. 40వేలు అందజేత

**కడ్తాల్, ఆగష్టు 24 ప్రభాతవార్త :** కడ్తాల్ గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామ దేవత పోచమ్మ, మైసమ్మ, కాటమయ్య వివిధ కుల దేవతల బోనాల మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు బోనాల ఉత్సవ కమిటి సభ్యులు తెలిపారు. గ్రామంలో శనివారం కాటమయ్య బోనాలు 25న ఆదివారం కుల దేవతలైన పెద్దమ్మ, బీరప్ప, ఈదమ్మ, ఈదమ్మ మాడెల్ స్వామివార్ల బోనాలు, 26న సోమవారం గ్రామ దేవతైన పోచమ్మతల్లి బోనాలు, 27న మంగళవారం రేణుక ఎల్లమ్మ బోనాలు జరగనున్నట్లు తెలిపారు. సింగిల్‌విండో ఛైర్మన్ గంప వెంకటేష్‌గుప్తా, రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ దశరథ్ నాయక్‌లు మాట్లాడుతూ బోనాలపండుగ తెలంగాణ సంస్కృతికి సంప్రదాయానికి ప్రతీకలని, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను చాటే ప్రధాన పండగల్లో ఒకటైన బోనాల ఉత్సవాలు రాజకీయాలకతీతంగా, అందర కలిసికట్టుగా జరుపుకోవాలని కోరారు. అదేవిధంగా కడ్తాల్ మండల కేంద్రంలో నిర్వహించే పోచమ్మ బోనాల ఏర్పాట్ల కోసం గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్టు నుండి రూ.30 వేలు, రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్టు నుండి రూ.10 వేలు తమవంతుగా పోచమ్మ దేవాలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులకు నిర్వహణ ఖర్చుల నిమిత్తం కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ సత్యంయాదవ్, నిర్వాహక సభ్యులు మలె మల్లేష్‌గౌడ్, చేగూరి వెంకటేష్, మాజీ సర్పంచ్ కృష్ణనాయక్, మహేష్, ప్రతాప్‌రెడ్డి, టిక్‌లాల్‌నాయక్, కృష్ణ పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాల పండుగ

**కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



ఆలయంలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**కడ్తాల్, ఆగష్టు 24 ప్రభాతవార్త :** కడ్తాల్ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో నాలుగు రోజులపాటు జరిగే బోనాల ఉత్సవాలు అత్యంత అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. శనివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీ కాటమయ్య బోనాల సందర్భంగా ముఖ్య అతిథులుగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, టిపిసిసి సభ్యులు అయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాట నరసింహ, డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, గౌడ సంఘం నాయకులో కలిసి ఉదయం ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో వర్షాలు విరివిగా కురవాలని, పాడి పంటలతో గ్రామం కళకళలాడాలని, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఆర్థికాభివృద్ధి చెందాలని, గ్రామ ప్రజలు పూర్తి ఆరోగ్యంతో ఉండాలని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో గౌడసంఘం అధ్యక్షులు మాలె మల్లేష్‌గౌడ్, బో నాల ఉత్సవ కమిటి ఛైర్మన్ సత్యంయాదవ్, డిసిసి కార్యదర్శి బిక్యానాయక్, మండల పార్టీ అధ్యక్షులు బిచ్చనాయక్, హన్మనా యక్, డా. రమేష్, జంగిర్ అలీ, హీరాసింగ్, అశోక్, శబ్బు, గౌడ సంఘం నాయకులు కింది కంటి యాదయ్యగౌడ్, మాల శ్రీనివాస్‌గౌడ్, మలె శివగౌడ్, శ్రీరాములు గౌడ్, రావుల రమేష్‌గౌడ్, కేశవులుగౌడ్, జగదీష్‌గౌడ్, రమేష్‌గౌడ్, శేఖర్ గౌడ్, జగదీష్‌గౌడ్ పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

**సింగిల్‌విండో డైరెక్టర్ డా. శ్రీనివాస్**



పాఠశాల క్రీడాభివృద్ధి కోసం రూ.10 వేలు అందజేసిన శ్రీనివాస్

**కడ్తాల్, ఆగష్టు 24 ప్రభాతవార్త :** విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యసిద్ధి కోసం కష్టపడి ఇష్టంతో విద్యనభ్యసించాలని సింగిల్ విండో డైరెక్టర్ శ్రీనివాస్ అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు అంకితభావం, క్రమశిక్షణను అలవర్చుకుంటే తప్పకుండా విజయం సాధిస్తారని తన అభిమతాన్ని వ్యక్తం చేశారు. మండలం రావిచేడ్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు క్రీడా వస్తువుల కోసం రూ. 10 వేలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, ఉపాధ్యాయ బృందానికి అందజేశారు. డా. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని, ఆశయాన్ని ఎంచుకోవాలని, దాని సాధన కోసం చదువుపై పట్టు సాధించి సులువుగా విజయం సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ సాబేర్, ఉపాధ్యాయ బృందం, జనార్ధన్‌గౌడ్, రాఘవేందర్, స్వరూప, రమేష్, మంజుల, వినోద్, శ్రీనివాస్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## సిపిఐఎంఎల్ ప్రతిఘటన పార్టీపై ఆరోపనలు మానుకోవాలి



గుండ్లపోచంపల్లిలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న పార్టీ నేతలు

**మేడ్చల్, ఆగస్టు 24. ప్రభాతవార్త :** సిపిఐ ఎంఎల్ ప్రతిఘటన పార్టీపై లేనిపోని ఆరోపనలు చేయడం మానుకోవాలని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు అన్నారు. మేడ్చల్ జిల్లా పరిధి గుండ్లపోచంపల్లిలో గల ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ నుండి వెళ్లిపోయిన ప్రేక్షావలి, సంతోష్‌లు పార్టీ నుండి వెళ్లిపోయి తమ పార్టీ కార్యకర్తలపై లేని ఆరోపనలతో ప్రకటనలు చేస్తున్నారని ఆరోపించారు. అదే విదంగా పార్టీ పేరు చెప్పి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని, ఇలాంటి పనులు మానుకోవాలని తెలిపాదు. లేదంటే ప్రజా కోర్టులో శిక్ష తప్పదని అన్నాడు. ఈ కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి ఎస్‌కే సైదులు, ప్రగత శీల మహిళా సమాఖ్య పిఓడబ్ల్యు బోనుగుల లలిత, భారత కార్మిక సంఘాల సమాఖ్య బెల్లుడుగా సాయిలు, తెలంగాణ రైతుకుల సంఘం రాష్ట్ర కార్యదర్శి రాము, అరుణోదయ సంస్కృతిక సమాఖ్య కామ్రేడ్ జీవన్ తదితరులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు

**కొందుర్గు, ఆగస్టు 24, (ప్రభాతవార్త) :** బదిలీపై వెలుతున్న ఉపా ధ్యాయులకు గ్రామస్తులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. శనివారం మండల పరిధిలోని ఉత్తరాశిపల్లి ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తించి బదిలీపై వెలుతున్న ఉపాధ్యాయులు వీరాచారి, కౌసల్యలను శాలువాలతో గనంగా సన్మానించి వారు విద్యార్థులకు విద్యాబోధన చేసిన విధానాన్ని కొనియాడారు. అనంతరం గ్రామస్థులు విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, విశ్రాంత వీఆర్వో గోపాల్‌రావు, ధర్మ సమాజ్ పార్టీ మండల కన్వీనర్ దప్పు రవీందర్‌తో పాటు గ్రామస్థులు, దాజీద్, అజీమ్, అబీబ్, పెంటయ్య, సాయన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పంటను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి: ఏడిఏ

**కోట్‌పల్లి ఆగస్టు, 24 ప్రభాతవార్త;** ప్రతి గ్రామంలో రైతులు సాగు చేస్తున్న పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని వికారాబాద్ ఏడిఏ స్వరూప అన్నారు. శనివారం నాడు కోట్‌పల్లి మండల పరిధిలోని కోత్తపల్లి గ్రామంలో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న రైతుల పంట పోల్లాలను అమె పరిశీలించారు. ఈసందర్భంగా అమె మాట్లాడుతూ. రైతులు తమతమ పంటలను అమ్మె సమయంలో ఎటువంటి ఇబ్బందులకు గురికావోద్దని రైతులకు సూచించారు. వ్యవసాయ పనులు చేస్తున్న సమయంలో వర్షం వచ్చినా ఉరుములు, మెరుపులతో కూడి వర్షం కాని ఆదురు గాలులు వచ్చిన ఎవ్వరు కుడా చెట్ల కింద ఉండరాద్దని సాధ్యమైనంత వరకు త్వరగా ఇంటికి చేరుకోవాలని రైతులకు సూచించారు. పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటూ రైతులు పంటలను విక్రయించే సమయంలో ఎటువంటి ఇబ్బందులకు గురికారని నమోదు చేసుకోకపోతే తరువాత చాలా ఇబ్బందులకు గురికాక తప్పదన్నారు. అనంతరం చీడ పురుగుల నివారణ కోసం రైతులకు పలు రకాల సూచనలు చేశారు. అమె వెంట ఏఈఓ సందీప్, తదితరులు ఉన్నారు.

## పాఠశాలల్లో కోలాహలంగా గోకులాష్టమి




చిన్నారుల చేత ఉట్లు కొట్టిస్తున్న చైర్మన్ చుక్కా అల్లాజీగౌడ్

**ఆమనగల్లు, ఆగస్టు24, ప్రభాతవార్త:** శ్రీకృష్ణాజన్మాష్టమి పురస్కరించుకుని శనివారం పలు ప్రైవేటు పాఠశాలలు గోకులాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలల చిన్నారులు చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణతో ముస్తాబై వచ్చి కోలాహలం కల్పించారు. వేడుకల సంధర్భంగా పాఠశాలల్లో పండగ వాతావరణం సంతరించుకుంది. పట్టణంలోని ఆమనగల్లు గ్రామర్ హైస్కూల్, లిటిల్‌స్కాలర్స్ టెక్నో హైస్కూల్, అరబిందో హైస్కూల్, లిటిల్‌స్కాలర్ హైస్కూల్‌తోపాటు పలు పాఠశాలల్లో వేడుకలు జరుపుకున్నారు. చిన్నారులను చూడడానికి తల్లిదండ్రులు, ఇతరులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం పలు గీతాలపై నృత్యాలు చేయగా, చివరిన చిన్నారుల చేత ఉట్లు కొట్టించి వేడుకలను ముగింపు పలికారు. ఆయా కార్యక్రమాలలో చుక్కా అల్లాజీగౌడ్, అవ్వారి శివలింగం, బికుమాండ్ల ప్రదీప్‌కుమార్, కోట్ల వెంకటేశ్, ఆమనగంటి సంజీవ్‌కుమార్, నల్లబోలు సుదర్శన్‌రెడ్డి, జిల్లెల సుదర్శన్‌రెడ్డి, చుక్కా సావిత్రిగౌడ్, జిల్లెల సుజాతారెడ్డి తదితరులు ఉన్నారు.

## వాలీబాల్, నెట్ స్కూల్‌కు అందజేత




**తలకొండపల్లి, ఆగస్టు 24,ప్రభాతవార్త:** స్కూల్ ఉపాధ్యాయుల కోరిక మేరకు శనివారం తలకొండపల్లి మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాజీ వార్డు మెంబర్ పద్మ విఠల్ ముదిరాజ్ తన చదువుకున్న స్కూల్‌లో ఏదో ఒకటి ఇవ్వాలని ఒక చిన్న ఆలోచనతో వాలీబాల్ మరియు నెట్ స్కూల్‌కు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహేష్‌యాదవ్, వినయ్‌కుమార్ గూడ వికాస్ బుమోని శ్రీను యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల బలోపేతానికి కృషి చేయాలి

**అమ్మ ఆదర్శపాఠశాల ఛైర్‌పర్సన్ పెరుమాండ్ల లలితమ్మ**



సమావేశంలో మాట్లాడుతున్న లలితమ్మ

**తలకొండపల్లి, ఆగస్టు 24,ప్రభాతవార్త:** తలకొండపల్లి జెడ్పిహెచ్ఎస్ హై స్కూల్‌లో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి అమ్మ ఆదర్శపాఠశాల ఛైర్‌పర్సన్ పెరుమాండ్ల లలితమ్మ ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. తలకొండపల్లి మండలకేంద్రంలోని జడ్పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో అడ్మిషన్లు జరుగుతున్నాయి. కావున ఆసక్తిగల విద్యార్థిని విద్యార్థులు అడ్మిషన్లు పొంది మీ యొక్క బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని తెలియజేశారు. గతంలో ఈ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు అన్ని రంగాలలో తమ యొక్క పాత్రను నిర్వహిస్తున్నారు. కావున మనం చదివిన పాఠశాల ను ఎప్పుడు మర్చిపోకుండా మనకు జ్ఞానం నేర్పిన తల్లిలాంటి పాఠశాలబలోపేతం కొరకు ప్రతి ఒక్కరూ పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములై మీ వంతుగా కృషి చేయాలని ఆమె ఆశించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## గుడితాండలో మేకల దొంగతనం

**మాడ్గుల, ఆగష్టు24, ప్రభాతవార్త:** మండలంలోని గుడితాండ గ్రామ పంచాయితీలో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు హాల్‌చల్ చేశారు. బాధితుల కథనం మేరుకు తాండకు చెందిన రాందాస్ నాయక్ దొడ్డిలో నుండి 5గొర్రెలు, 3పోడేలు, 2మేకలు, నరియాకు చెందిన 1మేకపోతు, సీతారాం నాయక్ చెందిన 1 మేకపోతు అపహరణకు గురైనట్లు వారు తెలిపారు. శనివారం బాధితులు మాడ్గుల పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. సంఘటనపై సిఐ నాగరాజుగౌడ్ విచారణ చేపటినట్లు తెలిపారు.

## రాగం అర్జున్‌కు ఘన సన్మానం



బిజెపి యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అర్జున్‌ను సన్మానించిన పార్టీ నేతలు

**మేడ్చల్, ఆగస్టు 24. ప్రభాతవార్త :** భారతీయ యువమోర్చా రాష్ట్ర కమిటి కార్యవర్గ సభ్యుడుగా ఎన్నికైన రాగం అర్జున్‌ను బిజెపి నాయకులు శనివారం బిజెపి రూరల్ జిల్లా కార్యవర్గ సమావేశంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, పార్టీ అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమల్‌రెడ్డి, కూరపాటి విజయ్, యువమోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సామల పవన్‌రెడ్డి, చిత్రంజన్‌రెడ్డి, మధుసూధన్ గౌడ్, పవన్‌రెడ్డి, బుద్ది శ్రీను, ప్రభాకర్‌రెడ్డి, జగన్ గౌడ్, అంజనేయులు, శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### గ్రేసియాతో శుద్ధి చేసిన మొలకలతో ఆరోగ్యం

దేశం యొక్క మొత్తం సుగంధ ద్రవ్యాల ఎగుమతుల్లో 42 శాతంతో మిరప పంటలు దేశ ఆర్థిక వ్యవస్థలో మరియు రైతుల అభ్యున్నతిలో కిలక పాత్ర పోషిస్తున్నాయి. అయినప్పటికీ విజయవంతమైన మిరప సాగు యొక్క పునాది ఆరోగ్యకరమైన మొలకల మీద ఆధారపడి ఉంటుంది. ఇది అతితక్కువ ఖర్చుతో కూడుకున్న మార్పిడికి దారితీస్తుంది. మిరప పరిశ్రమ లో విజయం అనేది నారు నాణ్యతతో ప్రారంభమవుతుంది. గ్రేషియాతో శుద్ధి చేసిన మొలకలు ఆరోగ్యంగా ఉంటాయి. నర్సరీ యజమానులకు మరింత వ్యాపారం జరిగేందుకు ఇది తోడ్పడుతుంది. ఎందుకంటే రైతులు వారినుంచి కొనుగోలు చేస్తారని గోద్రెజ్ ఆగ్రోవెట్ క్రాప్ ప్రొటెక్షన్ బిజినెస్ సీఈవో రాజవేలు ఎన్‌కె తెలిపారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

## ఆరోగ్యశ్రీ పై అవగాహన పెంచండి

**షాద్‌నగర్, ఆగస్టు 24, (ప్రభాతవార్త) :** షాద్‌నగర్ నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆరోగ్యశ్రీ పథకం గురించి ప్రచారం చేయాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం ఎమ్మెల్యే ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఫరూఖ్‌నగర్, నందిగామ, జిల్లెడ్ చౌదరిగూడ, కేశంపేట, కొందుర్గు, షాద్‌నగర్, పట్టణ ప్రాంతాలకు చెందిన 48 మందికి 17లక్షల 5వేల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ... సీఎం రిలీఫ్ ఫండ్ ఇకపై తీసుకుండా ఒక లక్ష రూపాయల నుంచి దాదాపు 10 లక్షల రూపాయల వరకు వచ్చే ఆరోగ్యశ్రీ వైద్యాన్ని ప్రజలు అందిపుచ్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, మాజీ జడ్పీటీసీ వెంకట్ రాంరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గం నాయకులు పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, నర్సప్పగూడ కృష్ణ, సింగారం సుదర్శన్, సీతారాం, లింగారెడ్డిగూడ ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆవోపా ఆధ్వర్యంలో విద్యార్థికి ఆర్థిక సహాయం

**- రూ.51 వేల నగదును విద్యార్థిని కుటుంబానికి అందజేత**



ఆర్థిక సహాయం అందజేస్తున్న ఆవోపా సభ్యులు

**షాద్‌నగర్, ఆగస్టు 24, (ప్రభాతవార్త) :** పట్టణానికి చెందిన ఆర్యవైశ్య కుటుంబానికి చెందిన అల్లంపల్లి హన్సిక అనే విద్యార్థిని ఉన్నత చదువుల కోసం ఆవోపా ఆధ్వర్యంలో రూ.51వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. శనివారం పట్టణంలోని ఆవోపా కార్యాలయంలో ఆవోపా అధ్యక్షుడు ఎలుకుర్తి నాగరాజు, ప్రధాన కార్యదర్శి శివకార్తీక్, ఆర్థిక కార్యదర్శి ధర్మాపురం మనోజ్‌ల ఆధ్వర్యంలో దాతల సమాక్షంలో అమ్మాయి కుటుంబ సభ్యులకు నగదును అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఏలుకుర్తి నాగరాజు మాట్లాడుతూ... ఆర్యవైశ్యుల సహకారంతో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతామని ఆయన తెలిపారు. విద్యార్థిని ఉన్నత చదువుల కోసం ఆర్థిక సహాయం చేసిన కల్వగురి వెంకటేష్, జి.శ్రీనివాసులుగౌడ్, గడ్డం నందకిషోర్, ఎలుకుర్తి వీరేశం, బొంతపల్లి విద్యాసాగర్, పెనుగొండ ఆశోక్, నవీన్‌కుమార్, యచ్చం రాఘవేందర్, పోల శశి, గుడిపల్లి వెంకటరమణ, ఎంపీఎస్ సురేష్, బొంతపల్లి వీరయ్య, ఏలుకుర్తి శ్రీనివాస్, మలిపెద్ది శ్రీనివాస్, యంసాని శ్రీనివాస్, నీల నర్సింహులు తదితరులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులు బెజుగం రమేష్, ఆవోపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గడ్డం నందకిషోర్, ఆవోపా రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు తాటి రామచంద్రుడు, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు కల్వ యాదగిరి, కల్వ మురళీ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## సాక్షి గణపతి ఆలయానికి శంకుస్థాపన

**- పటేల్ రోడ్డులోని శివాంజనేయ స్వామి దేవాయలంలో హోమం.**



నూతన ఆలయ నిర్మాణం కోసం హోమం చేయిస్తున్న పూజారి

**షాద్‌నగర్‌రూరల్, ఆగస్టు 24, (ప్రభాతవార్త) :** ఫరూఖ్‌నగర్ మండల కేంద్రంలోని పటేల్ రోడ్డులో గల శ్రీ శివాంజనేయ స్వామి దేవాయలంలో సాక్షి గణపతి ఆలయానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని చేపట్టారు. శనివారం ఆలయంలో పూజారులు ఆలయ నిర్మాణ దాతలు మహేష్ వర్మ ముదిరాజ్, శ్రీధర్‌వర్మ ముదిరాజ్ కుటుంబ సభ్యులతో గణపతి దేవాయల శంకుస్థాపన, నవగ్రహ పూజ, దుర్గాదేవి పూజ, హోమం తదితర పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో పటేల్ రోడ్డు కాలనీ వాసులు దేవాలయ కమిటీ సభ్యులు టైలర్ రమేష్, కొంకళ్ల చెన్నయ్య, జీటీ శ్రీనివాస్, గడ్డమీది సుధాకర్, మన్నె విజయ్, పి.గోపాల్, మన్నె రంజిత్, ధనరాజ్ గుళ్ల నవీన్, రాజేష్, లడ్డు, ఢిల్లీ యాదగిరి, పిట్టల అంజిబాబు, గడ్డమీది పరమేశ్వర్, గుడి ప్రధాన అర్చకులు కిషోర్ పంతులు, దత్తు పంతులు తదితరులు పాల్గొన్నారు.

## మట్టి వినాయక విగ్రహాల తయారీపై పీసీబీ అవగాహన

**ఘట్‌కేసర్, ఆగస్టు 24, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం మట్టి వినాయక విగ్రహాల తయారీపై రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. 'మనం మట్టి గణేశ్ విగ్రహాలను తయారు చేద్దాం, ఇంట్లో, మన వీధిలో మట్టి గణేశ్ విగ్రహాలను ప్రతిష్ఠించి పూజ చేద్దాం' అనే అంశంతో మట్టి గణేశ్ విగ్రహాలపై టీజీపీసీబీ ప్రచారాన్ని ప్రారంభించింది. పూజలో ఉపయోగించే పువ్వులు, మూ లికలను కంపోస్ట్ చేయాలని, మట్టిలో కలవని పదార్థాలను స్వచ్ఛమైన నీటి వనరులలో ముంచవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 2024 సంవత్సరపు గణేశ్ చవితికి సంబంధించి మట్టి గణేశ్ విగ్రహాల ప్రచారం కోసం టీజీపీసీబీ ద్వారా అనేక పర్యావరణ చైతన్య కార్యక్రమాలలో భాగంగా వర్క్‌షాప్ నిర్వహించామని, జిల్లాలో 2,000 మట్టి విగ్రహాలు పంపిణీ చేయబోతున్నామని ప్రసన్నకుమార్ తెలిపారు.

## డ్రైనేజీ పనులను నాణ్యతతో చేపట్టాలి

**ఘట్‌కేసర్, ఆగస్టు 24, ప్రభాతవార్త:** భూగర్భడ్రైనేజీ నిర్మాణ పనులను నాణ్యతతో చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ 11వ వార్డులోని సూర్య ఎన్‌క్లేవ్‌లో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను శనివారం ఆమె పరిశీలించారు. కాలనీలో డ్రైనేజీ సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మురికి నీరు చేరడంతో అసౌకర్యం కల్గుతుందని అంటువ్యాధులు వస్తున్నాయని స్థానిక కౌన్సిలర్ కడుపొల్ల మల్లేష్ విజ్ఞప్తి చేయడంతో నిదులు మంజూరు చేసి డ్రైనేజీ పనులు చేపట్టామని ఆమె తెలిపారు.

## సంగారెడ్డిలో మదర్స విద్యార్థి అదృశ్యం

**సంగారెడ్డి టౌన్, ఆగస్టు 24, ప్రభాతవార్త:** పట్టణంలోని ప్రశాంత్ నగర్ కాలనీలోని మజీదులో మదర్స్ స్కూల్‌లో విద్యాభ్యాసం చేస్తున్న హఫీజ్‌పేట, శేరిలింగంపల్లి హైద్రాబాద్‌కు చెందిన షేఖ్ రహమాన్ (13) ఈ నెల 19వ తారీఖున ఎవరికి చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయాడని పట్టణ ఎస్ఐ భాస్కర్ తెలిపారు. ఎస్ఐ భాస్కర్ కథనం ప్రకారం... 19న ఉదయం 6.30గంటల ప్రాంతంలో మజీదులో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయినట్లు గుర్తించిన మదర్సా మొల్సాబ్ సయ్యద్ అమర్ అదృశ్యమైన విద్యార్థి తల్లి షబానా మేగంకు ఫోన్ చేసి సమాచారం అందించారన్నారు. కురుమాడి ఆచూకి కోసం ప్రయత్నించిన ప్రయోజనం లేకుండా పోవడంతో ఈ నెల 23న సాయంత్రం పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేశారన్నారు.

# ఘనంగా కృష్ణవేణిలో కృష్ణాష్టమి వేడుకలు



జోగిపేట హైస్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు జరుపుకుంటున్న విద్యార్థులు

**పుల్కల్, ఆగస్టు 24, ప్రభాతవార్త:** జోగిపేట పట్టణంలోని సాయి కృష్ణవేణి హై స్కూల్‌లో శనివారం విద్యార్థులు ముందస్తుగా కృష్ణాష్టమి వేడుకలను భక్తి శ్రద్దలతో ఆనందోత్స వాలతోఎ ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలలో విద్యను ఆర్జిస్తున్న చిన్నారి విద్యార్థులు రాధ, గోపిక, కృష్ణుడి వేషాలు ధరించి చూపరులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, కరస్పాండెంట్ నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

**కేరళా పాఠశాలలో..**

**హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు25, ప్రభాతవార్త** హుస్నాబాద్ పట్టణంలోని కేరళా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం రోజున ముందస్తు శ్రీకృ ష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా చిన్నారులు శ్రీకృష్ణ, గోపికల వేషాధరణలతో ఆటలు, పాటలతో అందరిని అలరించారు. ఈ సందర్బంగా పాఠశాల కరస్పాండెంట్ బుర్ర రాజేందర్ మాట్లాడుతూ సృష్టి, స్థితి కారకుడైన శ్రీకృష్ణుని జన్మదినం రోజున శ్రీకృష్ణాష్టమి జరుపుకుంటారని గుర్తు చేశారు. శ్రీకృష్ణుడు బోదించిన భగవద్గీతలో ఎన్నో అమూల్యమైన సందేశాలున్నా యన్నారు. కృష్ణుడు చెప్పిన తత్వం లో అందరు, దయా, కరుణ కలిగి మానవత్వంతో జీవనం సాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అల్లిశైలేందర్‌తో పాటు విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

**కోహెడలో....**

కోహెడ మండల కేంద్రంలోని శ్రీ ఆదర్శ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు శనివారం రోజున ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో విద్యార్థిని విద్యార్థులు శ్రీకృష్ణ, గోపికల వేషధారణతో అందరిని అలరించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు విద్యార్థుల తల్లితండ్రులను ఆకట్టుకు న్నాయి.



ముందస్తు కృష్ణాష్టమి వేడుకల దృశ్యం

అనంతరం పాఠశాల ఆవరణలో ఉట్టి కార్యక్రమాన్ని సైతం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ, కరస్పాండెంట్ అంజయ్యతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**మంజీరా విద్యాలయంలో..**

**రామాయంపేట మున్సిపాలిటీ, ఆగస్టు 24, ప్రభాతవార్త :** రామాయంపేట మున్సిపాలిటీలోని మంజీరా విద్యాలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం నాడు ఘనంగా నిర్వహించారు. ప్రతి యేడులాగే ఈ యేడుకూడా చిన్నారులతో ముందుగా శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ముందుగా శ్రీకృష్ణుడికి పూజ చేసి, మంగళహారతులు, నైవేద్యాలు, ఆరగింపుచేసి శ్రీకృష్ణుడిని ఉయ్యాలలో వేసి, లాలి పాటలు పాడారు. చిన్నారులు శ్రీకృష్ణుని వేషాధారణ, గోపికమ్మల వేషాధారణలతో వచ్చి నృత్యాలతో, కీర్తనలతో అందరిని అలరించారు. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టే కార్యక్రమం చాలా గొప్పగా సాగింది. అనంతరం పాఠశాల ఉపాధ్యాయురాలు వాసవి విద్యార్థులకు శ్రీకృష్ణాష్టమి విశిష్టతను వివరించారు. భారతదేశంలోని అన్ని రాష్ట్రాలలో ఈ పండగని రకరకాల పేర్లతో నిర్వహించడం జరుగుతుందన్నారు. శ్రీకృష్ణుడు భగవద్గీతలో బోధించినటువంటి కర్మ సిద్దాంతాలు ఈ లోకంలో ఎలాంటి పనులు చేయాలి, మనుషులు ఏ విధంగా ఉండాలి అనేటువంటి విషయాలు గీతలో చక్కగా వివరించారని తెలిపారు. ప్రతి ఒక్కరు సాటి మనుషులకు సాయం చేయాలని, భగవంతున్ని ప్రార్థించాలని, ధర్మ మార్గంలో నడవాలని గీత ద్వారా ఉపదేశించడం జరిగిందన్నారు. మనిషి చేసే పనుల పైనే మన కర్మ ఆధారపడి ఉంటుందని కృష్ణ పరమాత్ముడు చెప్పడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ జితేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్, ఉపాధ్యాయులు మౌనిక, మీనా, కృష్ణప్రియ, శ్రీశైలం, యాదగిరి తో పాటు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



పాఠశాల ప్రాంగణంలో ఉట్టి కొడుతున్న చిన్నారులు

**సింగాటం ప్రాథమిక పాఠశాలలో..**

**గజ్వేల్, ఆగస్టు 24 (ప్రభాతవార్త):** గజ్వేల్ మండలంలోని సింగాటం ప్రాథమిక పాఠశాలలో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల పిజి ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ మన సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు అందించాల్సినటువంటి బాధ్యత మన మీదనే ఉందని, విద్యతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులను ప్రోత్సహించడం చాలా అవసరమని తెలిపారు. అదేవిధంగా కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా విద్యార్థులతో ఉట్టి కొట్టించడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. గోపికలు, కృష్ణులుగా వేషధారణ ధరించిన విద్యార్థులను చూస్తే చాలా ఆనందం వేసిందని తెలిపారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంతోష్, ఉపాధ్యాయులు కుకునూరి శేఖర్, యశోద, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అధికారి ప్రవీణ్‌ను సన్మానించి స్వాగతం పలుకుతున్న దృశ్యం

## వ్యవసాయ అధికారికి ఘనంగా స్వాగతం

**నాగల్‌గిద్ద, ఆగస్టు 24, ప్రభాతవార్త:** మండలానికి వ్యవసాయ అధికారిగా బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించిన ఎ ప్రవీణ్‌ను శనివారం అంబేద్కర్ పూలే సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు రహీమ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైపండరి, రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ తాహూదీన్‌లు ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. రైతులకు అందుబాటులో ఉండి పంటల దిగుబడులు అధికంగా వచ్చేలా సూచనలు, సలహాలు అందిస్తానని, రైతులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ మండల రైతులకు సూచించారు.

## వృధాగా మిషన్ భగరీథ నీరు-పట్టించుకునే దెవరు



పాత కంది 2వ వార్డులో వృధాగా పారుతున్న మిషన్ భగీరత నీరు

**కంది, ఆగస్టు 24, ప్రభాతవార్త:** నీటిని వృధా చేయకుండా ఆదా చేయాలని పదే పదే చెప్పే అధికారులు, పాలకులు మండల కేంద్రమైన కందిలోని 2వ వార్డులో మిషన్ భగీరథ నీరు వృధాగా పారుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. తాగు నీరు వృధాగా పోతుండటంతో పాటు పైప్‌లైన్ లీకేజి మూలంగా కలుషిత నీరు గృహాలకు సరఫరా అవుతుండటంతో ప్రజలు ఎక్కడ అనారోగ్యానికి గురవుతామో అన్న భయంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైప్‌లైన్ లీకేజితో రోడ్డు గుండా తాగునీరు పారుతుండటంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారడం, దోమలు పేరుకుపోతుండటంలో ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి లీకేజీలను సరిచేసి తాగు నీరు వృధా కాకుండా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు వినతి చేస్తున్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందచేసిన ఎమ్మెల్యే



లబ్దిదారులకు సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందచేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

**జహీరాబాద్, ఆగస్టు 24, ప్రభాతవార్త:** పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 29 మంది లబ్దిదారులకు 7లక్షల 90వేల రూపాయల చెక్కులను ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అందచేశారు. సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్దిదారులు ఎమ్మెల్యేకు, అందుకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు నామ రవికిరణ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అశోక్ శేరి, మాజీ పట్టణ అధ్యక్షులు మోయిద్దీన్, యాకూబ్, మాజీ కౌన్సిలర్ అబ్దుల్లా , మహిళా అధ్యక్షురాలు మంజుల, నాయకులు సత్యం ముదిరాజ్, గణేష్, చంద్రయ్య, వహీద్, అలీ, లక్ష్మీకాంత్, అశోక్‌రెడ్డి, లవన్, ఫయాజ్, సందీప్ రాజ్ పాల్గొన్నారు.

వసాయ అధికారి ప్రవీణ్ మండల రైతులకు సూచించారు.

## సింగూర్ జడ్పీహెచ్‌ఎస్‌ను పరిశీలించిన ఎంఈఓ

**పుల్కల్, ఆగస్టు 24, ప్రభాతవార్త:** మండల పరిధిలోని సింగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ముదిమాణిక్ తండాలోని ఎంపిపిఎస్ పాఠశాలలను శనివారం మండల విద్యాధికారి శంకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి పాఠశాల రికార్డులను, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయ సారణిని పాటిస్తున్నా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల వర్క్ బుక్‌లను పరిశీలించారు. విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అందుకోవాలని విద్యార్థులకు ఎంఈఓ శంకర్ సూచించారు.

## ఓపెన్ స్కూల్ గోడపత్రిక ఆవిష్కరణ

**పుల్కల్, ఆగస్టు 24, ప్రభాతవార్త:** ఓపెన్ స్కూల్ విధానంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో విద్యను అందుకునే అవకాశాన్ని అర్హులు, ఆసక్తి గల వారు సద్వినియోగం చేసుకోవాలని ఓపెన్‌స్కూల్ జిల్లా సమన్వయకర్త వెంకటస్వామి సూచించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఓపెన్ స్కూల్ గోడ పత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్లు రెగ్యులర్ సర్టిఫికెట్లతో సమానంగా పనిచేస్తాయన్నారు. చదువును మధ్యలో ఆపేసిన వారు ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో చదువుకునే అవకాశం ఉందని, అర్హులు, ఆసక్తి గల వారు ఓపెన్ స్కూల్‌లో విద్యను అందుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## వ్యవసాయ పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

**చౌటకూరు, ఆగస్టు 24, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన చౌటకూరుతో పాటు మండల పరిధిలోని ఇసోజిపేట గ్రామాల్లో రైతులు సాగు చేసుకుంటున్న పంటలను వ్యవసాయ శాస్త్రవేత్తలు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జనార్ధన్ వ్యవసాయ క్షేత్రంలోని వరి పంటను పరిశీలించి కాండం తొలిచే పురుగు, ఆకు ముడత తెగులు సోకినట్లు గుర్తించామన్నారు. తెగుళ్ల నివారణకు క్లోరాన్ ట్రానిఇపోల్ 0.3 మిలి ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. గట్లపై గడ్డి జాతి మొక్కలు లేకుండా చేడాలని, ఫలితంగా అగ్గి తెగులు సంక్రమించకుండా ఉంటుందని వివరించారు. చౌటకూరు గ్రామానికి చెందిన రైతు జాఫర్ సాగు చేసుకుంటున్న ప్రత్తి పంటకు రసం పీల్చే పురుగులను (పచ్చదోమ, తెల్లదోమ, పేను బంక, తామర పురుగు)లను గమనించామన్నారు. తెగులు నివారణకు ఫిపోనిల్ 2 మిలి ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. కంది పంటలో గొడ్డు తెగులు నల్లి ద్వారా వ్యాప్తి చెందుతుందని, తెగులు నివారణకు స్పైరోమెసిఫోన్ 1 మిలి 1 లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు రాహుల్ విశ్వకర్మ, సరిత, తోర్నాల వ్యవసాయ పరిశోదన కేంద్రం శాస్త్రవేత్తలు డి శ్వేత వైపి-1శ్రీకాంత్, రావవెవవవవప్ ఇసోజిపేట్ విద్యార్థులు, చౌటకూరు విద్యార్థులు, వ్యవసాయ అధికారి ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీల సమస్యల పరిష్కారానికి సిఎం కార్యాలయం వరకు పాదయాత్ర

**సిద్దిపేట రూరల్, ఆగస్టు 24, ప్రభాతవార్త :** ఆదివాసీల జాతి కోసం..తమ ప్రాంతంలో వైద్య, విద్య, రోడ్డు మార్గాలు వేయాలని అదిలాబాద్ జిల్లా తిర్యాణికి చెందిన పెందురు దర్మ్ చేపట్టిన పాదయాత్ర శనివారం సిద్దిపేటకు చేరుకుంది. సిద్దిపేటకు చేరుకున్న పాదయాత్రకు తెలంగాణ జన సమితి నాయకులు సంఘీభావం ప్రకటించారు. కొమురంభీమ్, అసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం నుంచి హైదారాబాద్‌లోని సిఎం కార్యాలయం వరకు 350 కిలోమీటర్ల పాదయాత్రగా అదివాసి ఉద్యమకారుడు పెందురు ధర్మ్ ఆగస్టు 15న ప్రారంభించారు. గాంధీ వేషంలో రోడ్డు మార్గన పాదయాత్రగా బయలు దేరి సిద్దిపేటకు చేరేకుంది. అదివాసిన ప్రజల రోడ్డు కోసం సత్యాగ్రహ దీక్షను కొనసాగిస్తున్నారు. తిర్యాణి మండలంలోని 29 గ్రామాలకు రవాణ సౌకర్యం లేక ప్రజలు దశాబ్దా కాలాల నుంచి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వైద్య, విద్య రోడ్డు మార్గాలు కల్పించాలన్నారు. అదివాసి ప్రారంతలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. తమ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను సిఎం రేవంత్‌రెడ్డికి వివరిస్తామన్నారు. కార్యక్రమంలో అందే ప్రవీణ్, కిసరి స్వామి తదితరులు ఉన్నారు.

## కెసిఆర్ ట్రోఫిపై మాట్లాడే అర్హత లేదు

**సిద్దిపేట రూరల్, ఆగస్టు 24, ప్రభాతవార్త :**

బిఆర్‌ఎస్ పార్టీలో పని చేసి ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన పలువురు నాయకులు మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు పై స్థాయికి మించి విమర్శలు చేయడం మానుకోవాలని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి, కౌన్సిలర్ కలకుంట్ల మల్లికార్జున్ హెచ్చరించారు. శనివారం ఆయన సిద్దిపేటలో విలేకరులతో మాట్లాడారు. బిఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిని నమ్ముకుంటే కాంగ్రెస్ పార్టీ పరిస్థితి శంకరగిరి మాన్యలే అవుతుందన్నారు. కెసిఆర్ ట్రోఫిపై మాట్లాడే కనీస నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీ నాయకులు బుచ్చిరెడ్డికి లేదని మండిపడ్డారు. కెసిఆర్ ట్రోఫిలో విన్నర్స్, రన్నర్స్‌కు నగదు బహుమతులు ఇవ్వలేదని ఆరోపించడం సిగ్గు చేటన్నారు. తెలిసి తెలియక మాట్లాడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. సిద్దిపేటలోని క్రికెట్ స్టేడియం మరుగున పడానికి కారణం వారే అన్నారు. కెసిఆర్ ట్రోఫితో ముందుకు వచ్చి క్రికెట్ మైదానంపై క్రికెట్ అసోసియేషన్‌పై చెడ్డ పేరు తేవాడానికి ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. బిఆర్‌ఎస్ ఉన్నంత కాలం హరీష్‌రావు మా దేవుడితో సమానం..అని ప్రగల్బాలు పలికిన నాయకులు ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరి అర్థం. పర్థం లేకుండా వ్యాఖ్యాలు చేస్తున్నారని మండిపడ్డారు. పార్టీలు మారినంత మాత్రన ఇష్టానుసారంగా వ్యాఖ్యాలు చేస్తే చూస్తూ ఉరుకోమన్నారు. సమావేశంలో మహేష్, శ్రీనివాస్, బాబు, రమేష్, రఘు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహ ఆవిష్కరణను విజయవంతం చేయండి

**గజ్వేల్ టౌన్, ఆగస్టు 24 (ప్రభాతవార్త):** సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ముస్తాబాద్ రోడ్డులో ఈనెల 25వ తేదీ ఆదివారం నిర్వహించనున్న కొరివి కృష్ణస్వామి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి గజ్వేల్ నియోజకవర్గంలోని ముదిరాజ్ కులస్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని గజ్వేల్ నియోజకవర్గ కొరివి కృష్ణస్వామి యూత్ అధ్యక్షుడు రిప్పల స్వామి, చింతకాయల శ్రీనివాస్, కుంట సత్యం, స్వామి, పిట్ల ఆంజనేయులు పిలుపునిచ్చారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు మదూర్ విద్యార్థి

**చిన్నశంకరంపేట, ఆగస్టు 24, ప్రభాతవార్త:** మండల పరిధి మదూర్ జడ్పీ ఉన్నత పాఠశాల తొమ్మిదవ తరగతి విద్యార్థి రాజమల్లు రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపీక అయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చేగుంట పట్టణంలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో రాజమల్లు అత్యుత్తమ ప్రతిభను కనబర్చాడని, త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి యోగా పోటీలలో రాజమల్లు పాల్గొనన్నుట్లు ఆయన తెలిపారు. వ్యాయమ ఉపాధ్యాయులు నరేష్, విద్యార్థి రాజమల్లును పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

## వైద్యుల నిర్లక్ష్యంతోనే బిడ్డ మృతి

**ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగిన బాధితులు**

**లేదు డెంగ్యూతో మృతి చెందారని వైద్యుడు**

**సిద్దిపేట అర్బన్, ఆగస్టు 24, ప్రభాతవార్త :** తమ బిడ్డ మృతి చెందడానికి వైద్యుల నిర్లక్షమేనని ఆరోపిస్తూ బాధిత కుటుంబీకులు, బంధువులు ఓ ప్రైవేటు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగిన సంఘటన సిద్దిపేట జిల్లా కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. సిద్దిపేటలో నివాసముంటున్న రాజు, రజిత కుమారుడు అయాన్స్(5) కు ఈనెల 19న జర్వరం రాగా సిద్దిపేట పట్టణంలోని ఓ ప్రైవేటు పిల్లల ఆసుపత్రికి తీసుకవచ్చినట్లు బాధితులు తెలిపారు. పరీక్షలు చేసి మందులు రాసి ఇంటికి పింపించినట్లు తెలిపారు. తీర జ్వరం తగ్గకపోవడంతో తిరిగి బాలున్ని ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రక్త పరీక్షలు చేసిన అనంతరం బాలునికి డెంగ్యూ జ్వరం వచ్చిందని అసుపత్రిలో చేర్పించాలని వైద్యులు చెప్పగా ఆసుపత్రిలో చేర్పించారు. బాలునికి జ్వరం మరింత పెరగడంత మెరుగైన వైద్యం కోసం మరో ఆసుపత్రికి వైద్యులు తీసుకెళ్లారు. వెంటిలేటర్‌పై చికిత్స పొందతూ బాలుడు మృతి చెందారు. దీంతో వైద్యుని నిర్లక్ష్యం మూలంగానే బాబు చనిపోయడాని బాధితులు , కుటుంబీకులు వైద్యున్నిపై చర్యలు తీసుకోవడంతో పాటు తమకు న్యాయం చేయాలని ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బాధితులను శాంతింపజేశారు. డెంగ్యూతోనే బాలుడు మృతి చెందాడు తప్ప తమ నిర్లక్ష్యం లేదని వైద్యుడు మనోహర్ తెలిపారు.

## సిద్దిపేటలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**సిద్దిపేట అర్బన్/మిరుదొడ్డి, ఆగస్టు 24, ప్రభాతవార్త :** మండల పరిధిలోని నాంచారుపల్లి ప్రాథికోన్నత పాఠశాలలో శనవానం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ యువకులు ఉత్సహంగా పాల్గొన్నారు. విద్యార్థుల నృత్యాలు అందరినీ అలరించాయి. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జ్యోతి, ఉపాధ్యాయులు అమిత, శ్రీనివాస్, స్రవంతి, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

**మిరుదొడ్డిలో..**

మండల పరిధిలోని చార్వాక మోడల్ స్కూల్‌లో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ధర్మారం కుమార్ మాట్లాడుతూ సంస్కృతిచ సంప్రదాయాలను కాపాడుకోవాల్సన బాధ్యత అందరిపై ఉందన్నారు. కృష్ణుడి, గోపికమ్మ వేషధారాణలతో పిల్లలు చూపరులను ఆకట్టుకున్నారు. స్కూల్ ఆవరణలో ఉట్టి తయారు చేసి ఉటిన కొట్టే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది పద్మ, శామయ్య, శ్రీలత, వాణి, స్వాతి, వరలక్ష్మీ, మౌనక, రాణి, శ్యామల, శంకర్, ప్రవీణ్, షఫీ పాల్గొన్నారు.

# ఘనంగా స్నాతకోత్సవం

## ఇంజనీరింగ్ పూర్తి చేసిన విధ్యార్థులకు డిగ్రీ పట్టాల పంపిణీ

**నర్సాపూర్ ఆగస్టు 24. ప్రభాతవార్త:** నర్సాపూర్ పట్టణ సమీపంలోని బివిరాజు సాంకేతిక విధ్యాసంస్థ బివిఆర్‌ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో 2020...2024 సంవత్సరానికి గాను బిటెక్ కోర్సులు పూర్తి చేసిన విధ్యార్థని విధ్యార్థులకు కళాశాల ప్రాంగణంలో గ్రాడ్యుయేషన్ డే, స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ స్నాతకోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైద్రాబాద్ క్యాంపస్ నుండి ప్రొఫెసర్ డాక్టర్ సౌమ్యా ముఖర్జీ, డైరక్టర్ బిట్స్ ఫిలానీ లు హాజరయ్యారు ఈసందర్బంగా వారు మాట్లాడుతూ ఇంజనీరింగ్ ఇంటర్ డిసిప్లినరీ కోర్సుల వల్ల చాలా లాబాలున్నాయని తెలిపారు. అదేవిదంగా బయో మెడికల్ ఇంజనీరింగ్ ద్వార మానవ హృద్రోగ ఆరోగ్య సమస్యలు ఈ ఇంజనీరింగ్ విభాగం ద్వార సరిష్కారమవుతాయన్నారు. అందువల్ల ఉన్నత విధ్యా సంస్థలైన ఐఐటి బాంబే, హైద్రాబాద్, నర్సాపూర్ బివిఆర్‌ఐటి కళాశాలలో బయో మెడికల్ కోర్సులను ప్రారంబించారని తెలిపారు. నేటి నాగరిక సమాజానికి వాటి ప్రాముఖ్యతను విశ్లేషణలను తెలియ జేశారు. నేడు ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఈసీఈ) ఎంబిటెడ్స్ సిస్టమ్ ద్వార ఎలక్ట్రానిక్ సర్కుల్స్ ద్వార ప్రపంచ వ్యాప్తంగా అమెరికాలో 4 లక్షల ఉద్యోగ అవకావాలున్నాయని అన్నారు, అవి కేవలం సర్కుట్ బ్రాంచి పైన (ఈసీఈ)(ఈఈఈ) మెకానికల్ ఇంజనీరింగ్స్ వారికి మంచి ఉద్యోగ భవిష్యత్తు ఉందని అన్నారు. విద్యార్థులు ఇంటర్ డిసిప్లినరీ అయిన సాంప్రదాయ కోర్సులు చదివి ఉద్యోగ అవకాశా లు పొందాలని వారు సూచించారు. ఈసందర్బంగా కళాశాల నుండి అత్యుత్తమ ప్రతిభ గలిగి మొదటి ర్యాంక్ సాధించిన విధ్యార్థులకు గోల్డ్ మెడల్స్, కోర్సులు పూర్తి చేసుకున్న విధ్యార్థులకు బిటెక్ డిగ్రీ పట్టాలను ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమం మొత్తం కళాశాల డిజిఎం కాంతారావు, మేనేజర్ బాపిరాజు, ఏవో లు అశోక్‌రెడ్డి, సురేశ్ ల పర్యవేక్షణలో జరిగింది. ఈ మేరకు కోర్సులు పూర్తి చేసుకున్న విధ్యార్థులు గత మధుర సృతులను గుర్తు చేసుకుంటు తమ ఆనందాలను పంచుకున్నారు. ఈమేరకు కళాశాలలో జరిగిన సాకనతకోత్సవ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది